క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతునన ఎస్‌ఐ తిరుపాల్

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతర శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించిన పోలీసులు కఠినంగా చర్యలు తప్పవని ఎస్‌ఐ తిరుపాల్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్‌లో పాత నేరస్తులు, రాజకీయ నాయకులకు ఎస్‌ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 114 సెక్షన్, పోలీసు యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. విజయోత్సవ సంబరాలు నిషేధమని, అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాల్మీకి గుహలను సందర్శించిన కౌంటింగ్ అబ్జర్వర్



వాల్మీకి గుహలను తిలకిస్తున్న ఎన్నికల కౌంటింగ్ అబ్జర్వర్ తదితరులు

ప్యాపిలి: మండల పరిధిలోని బోయవాండ్లపల్లి సమీపంలో వెలసిన వాల్మీకి గుహలను ఆళ్లగడ్డ నియోజకవర్గం ఎలక్షన్ కౌంటింగ్ అబ్జర్వర్ ఎ. దినేశ్ కుమార్, ఉద్యానశాఖ జిల్లా అధికారి నాగరాజు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు గుహల అందాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సహజసిద్ధంగా వెలసిన వాల్మీకి గుహలు అద్భుతంగా ఉన్నాయన్నారు. గుహల పైభాగంలో వేలాడే శిలాకృతులు, శివలింగం, నంది ఆకృతి చూసి మధురానుభూతి పొందినట్లు తెలిపారు. వారితో పాటు ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి, వీఆర్‌ఓ రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి ఉరుములు మెరుపులు

కొలిమిగుండ్ల: వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. శనివారం అర్ధరాత్రి ఒక్క సారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. పెద్ద ఎత్తున ఉరుములు, మెరుపులు గంటకు పైగానే అలజడి సృష్టించాయి. పెద్ద శబ్ధాలతో ఉరుములు, మెరుపులతో దద్దరిల్లడంతో ఎక్కడా పిడుగులు పడుతాయోనని జనం భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ శాఖ అధికారులు ముందుస్తుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అయితే తేలికపాటి వర్షం మాత్రమే కురిసింది. నైరుతి రుతుపవనాల కంటే ముందుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

అవుకు: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కిరణ్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. హోటల్స్, బస్టాండ్స్, గ్రామ చావిళ్లు తదితర ప్రదేశాల్లో ప్రజలు నలుగురికి మించి ఉండరాదన్నారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, ర్యాలీలు, ఊరేగింపులు చేయొద్దని సూచించారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


బేతంచెర్ల: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని బేతంచెర్ల సీఐ ప్రియతం రెడ్డి తెలిపారు. మెడికల్ ఎమర్జెన్సీ ఉంటే తప్ప బేతంచెర్ల టౌన్‌కు రావద్దని గ్రామీణ ప్రజలకు సూచించారు. 144 సెక్షన్, పోలీస్ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని, ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. గెలుపోటములకు సంబంధించి ఇతరులను రెచ్చగొట్టడం, కవ్వింపు చర్యలకు పాల్పడినా, ప్రోత్సహించినా కేసులు నమోదు చేస్తామన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిషేధమని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కౌంటింగ్ రోజు 144 సెక్షన్

కొలిమిగుండ్ల: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 4వ తేదీన 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఆటోలో మైక్ ద్వారా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కౌంటింగ్ రోజు రోడ్లపై టీస్టాళ్లు, హోటళ్ల వద్ద గుంపులుగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు బయటకు రాకుండా ఇళ్ల వద్దే ఉండాలని సూచించారు. విజయోత్సవ ర్యాలీలు నిషేధమని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు అభ్యంతకరమైన పోస్టింగ్‌లు పెట్టరాదన్నారు. ఇప్పటికే గ్రామాలపై నిఘా ఉంచామని సీఐ చెప్పారు.

అంతిమ తీర్పు రేపే !

- నవాబుల కోట .. వైఎస్సార్‌సీపీకే అనుకూలం
- సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టిన ఓటర్లు
- మరోసారి పాగావేయనున్న కాటసాని



నవాబుల కోట

కోవెలకుంట్ల: 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటనకు ముహూర్తం దగ్గర పడుతోంది. మే 13వ తేదీన పోలింగ్ జరుగగా అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. ఈ నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. బనగానపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా బీసీ జనార్దన్‌రెడ్డి ఎన్నికల బరిలో నిలిచారు. కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి అభ్యర్థులు బరిలో నిలిచినా వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 277 పోలింగ్ బూతుల్లో 2,41,179 మంది ఓటర్లు ఉన్నారు. గత నెల 13న జరిగిన ఎన్నికల పోలింగ్‌లో 2,03,839 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. బనగానపల్లె మండలంలో 71,747 మంది, కోవెలకుంట్ల – 32,449, కొలిమిగుండ్ల – 37,947, అవుకు– 33,648, సంజామల మండంలో 27,785 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నవాబుల కోట.. వైఎస్సార్‌సీపీకే అనుకూలం

రేనాటిగడ్డ(కోవెలకుంట్ల) నుంచి నవాబుల కోటగా మార్పు చెందిన బనగానపల్లె నియోజకవర్గంలో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. పునర్విభజనతో మార్పు చెందిన ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు మూడు పర్యాయాలు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 2009, 2019 ఎన్నికల్లో కాటసాని రామిరెడ్డి విజయం సాధించగా 2014లో బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపొందారు. 2019ఎన్నికల కంటే 2024 ఎన్నికల్లో బనగానపల్లె నియోజకవర్గంలో ఎక్కువశాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో 80.48 శాతం పోలింగ్ నమోదుకాగా ఈ ఎన్నికల్లో ఏకంగా 84.52 శాతం పోలింగ్ నమోదు కావడంతో వైఎస్సార్‌సీపీ గెలుపుపై ధీమాతో ఉంది. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గడిచిన ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి.... ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విజయంలో కీలక పాత్ర పోషించనున్నాయి. సంక్షేమం, అభివృద్ధికి తోడు నియోజకవర్గంలో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా కాటసానికి పేరుంది. ప్రజలను అప్యాయంగా పలకరించి అందరికీ అందుబాటులో ఉండడమే కాకుండా ఏ చిన్న సమస్య ఆయన దృష్టికి వెళ్లినా తక్షణమే స్పందించి ఆ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు పట్టువదలని విక్రమార్కుడిలా దూసుకపోతున్నారు. అర్ధరాత్రి వేళ అయినా సమస్య ఉందంటూ ఫోన్ చేసినా స్పందించే నైజం ఉన్న నాయకుడిగా పేరుంది. అన్ని అంశాలు కాటసానికి అనుకూలంగా మారటంతో ఈ ఎన్నికల్లో విజయం దిశగా అడుగు లేస్తున్నారు.



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మెజార్టీపైనే ఆసక్తి....

పోలింగ్ శాతం పెరగడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మెజార్టీపై ఆసక్తి చూపుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొన్ని గ్రామాలు కంచుకోట. అవుకు మండలంలో ఉప్పలపాడు, జూనూతల, కొండమనాయినిపల్లె, పిక్కిళ్లపల్లి తండా, అన్నవరం, గోకులదిన్నె, నిచ్చెనమెట్ల, గుండ్లశింగవరం, గడ్డమేకలపల్లె, కొలిమిగుండ్ల మండలంలో నాయినిపల్లెతోపాటు పెద్దవెంతుర్ల, బి. ఉప్పలూరు, కోటపాడు, ఎర్రగుడి, తుమ్మలపెంట గ్రామాలు కంచుకోటగా ఉన్నాయి. అదేవిధంగా బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు పట్టణాలతోపాటు, సంజామల, కొలిమిగుండ్ల మండల కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీకి బలమైన కేడర్ ఉండటం, గ్రామాల్లోనూ భారీగా పోలింగ్ నమోదు కావడంతో మెజార్టీపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి అవుకు మండలంలో 3 వేల నుంచి 4 వేలు, కొలిమిగుండ్ల మండలంలో 3 వేల నుంచి 4వేలు, కోవెలకుంట్ల మండలంలో 3వేలకుపైగా, సంజామల మండలంలో 1500 నుంచి 2వేల వరకు మెజార్టీ వస్తుందని ఆ పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. గత ఎన్నికల్లో బనగానపల్లె మండలంలో టీడీపీకి 4,750 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే ఈ ఎన్నికల్లో బనగానపల్లె పట్టణంతోపాటు మండలంలో సైతం వైఎస్సార్‌సీపీకి మెజార్టీ వస్తుందని అంచనా. ఇటీవల విడుదలైన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా వచ్చాయి. ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలను బేరీజు వేసుకుని నవాబుల కోటలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని ఆ పార్టీ శ్రేణులు గట్టి ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది.

గెలుపు, మెజార్టీపై భారీ బెట్టింగ్‌లు

బనగానపల్లె నియోజకవర్గ ఫలితంపై ఇప్పటికే భారీగా బెట్టింగులు జరిగినట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపుతో పాటు మెజార్టీపై నాయకులతోపాటు సామాన్యులు సైతం పెద్ద ఎత్తున పందేలు కడుతున్నారు. కోవెలకుంట్ల, బనగానపల్లె, అవుకు పట్టణాల్లోని మెజార్టీపై రూ. లక్షల్లో బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. వైఎస్సార్ సీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డి గెలుపునకు ఢోకా లేనప్పటికీ అంతిమ తీర్పు కోసం ఈ నెల 4వ తేదీ వరకు వేచి ఉండాల్సిందే.



24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

బనగానపల్లె : బనగానపల్లె నియోజవర్గానికి చెందిన ఓట్ల లెక్కింపు జిల్లా కేంద్రం నంద్యాల సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 4న జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామేశ్వరరావు తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలో 2,03,839 ఓట్లు పోల్ అయ్యాయన్నారు. పురషులు 1,00,548, మహిళలు 1,03,286 ఓటర్లు ఉండగా ట్రాన్స్ జండర్స్ ఐదుమంది ఉన్నారని వివరించారు. మొత్తం 12 టేబుళ్లు, 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ముందుగా నియోజకవర్గంలో 2,569 మంది పోస్టల్‌బ్యాలెట్లతో పాటు మరికొందరు సర్వీస్ ఓటర్లను లెక్కించడం జరగుతుందన్నారు. అనంతరం బనగానపల్లె మండలంలోని పసుపల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం అవు తుందని, సంజామల మండలంలోని నొస్సంతో ఓట్ల లెక్కింపు ముగుస్తుందని వివరించారు. కౌంటింగ్ ప్రక్రియలో మొత్తం 54 మంది సిబ్బంది పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.



ఆకాశం... వర్ణ శోభితం!

ప్రకృతి అందం వర్ణానాతీతం. ఎంత చెప్పినా తక్కువే. అప్పుడప్పుడు ఆశ్చర్యానికి...ఆనందానికి గురి చేస్తుంది ప్రకృతి. ఆదివారం సాయంత్రం ఆకాశం వర్ణ శోభితంగా మారింది. సాధారణంగా ఆకాశం ఎరుపు రంగు లేదా లేత పసుపు రంగులో దర్శనం ఇవ్వడం పరిపాటి. సూర్యస్తమయ సమయంలో ఆకాశం వంగ పూత రంగులో దర్శనమివ్వడంతో ప్రకృతి ప్రేమికులు పులకరించిపోయారు. డోన్ పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలోనే ఉన్నట్లు ఆకాశంలో దర్శనమిచ్చిన ఈ దృశ్యాలు ఆకట్టుకున్నాయి. – డోన్ టౌన్



వంగపూత లేత రంగుగా మారిన ఆకాశం

అప్రమత్తంగా ఉండండి

- పోలీస్ యాక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయండి
- వివాదాలకు దూరంగా ఉండేలా ప్రజలను చైతన్య పరచండి
- జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

అవుకు: సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ఈ నెల 4న నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే ఏ మాత్రం ఉపేక్షించొద్దని ఆదేశించారు. మండల పరిధిలోని కొండమనాయునిపల్లెలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్‌ను జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. గ్రామ ప్రజల పరిస్థితులపై ఎస్పీ ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వివాదాలకు దూరంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ నేపథ్యంలో విజయోత్సవ సంబరాలు నిషేధమని, ఆ దిశగా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. పోలీసుల నిబంధనలు ఉల్లంఘించినా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన వ్యక్తులను ఏ మాత్రం ఉపేక్షించొద్దని, కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ తిమ్మారెడ్డి, స్థానిక ఎస్‌ఐ కిరణ్, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ హరినాథ్ రెడ్డి, కానిస్టేబుల్ ఉస్సేన్ పాల్గొన్నారు.



కొండమనాయునిపల్లెలో పోలీస్ పికెట్‌ను పరిశీలిస్తున్న నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి



బనగానపల్లె పట్టణంలో పికెట్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పికెట్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ ఈ నెల 4న జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం బనగానపల్లె పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన పోలీసు పికెట్స్‌ను జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పికెట్‌లో ఉన్న పోలీసు సిబ్బందితో ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎక్కడ ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్యూటీలో నిర్లక్ష్యంగా ఉండకుండా నిరంతం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

ముందస్తుగా మొక్కజొన్న సాగు



వ్యవసాయబోరు కింద సాగు చేసిన మొక్కజొన్న

బనగానపల్లె: ఖరీఫ్ సీజన్‌కు ముందే బనగానపల్లె నియోజకవర్గంలో ముందస్తుగా రైతులు మొక్కజొన్న సాగు చేశారు. నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 10 200 హెక్టార్లు ఉన్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. బనగానపల్లెలో ఎక్కడలేనంతగా దాదాపు 11వేల వ్యవసాయ బోర్లు ఉండగా వీటి ఆధారంగా 30–35 వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం లభిస్తుంది. మొక్కజొన్న పంటసాగుకు నల్లరేగడి నేలలు అనువుగా ఉన్నందున రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. గత 20 రోజులుగా సుమారు 2,600 హెక్టార్లలో ఈ పంటను రైతులు సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈ జూన్ 15 వరకు ఈ పంటను సాగు చేయు అవకాశం ఉందన్నారు. గత సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్ మొక్కజొన్న పంటను రైతులు సాగు చేయగా మంచి దిగుబడి లభించింది. అదేవిధంగా గిట్టుబాటు ధర లభించడంతో ఈ సంవత్సరం అధిక విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. ఈ పంటను చీడపీడలు తక్కువ ఆశిస్తునందున పెట్టుబడి తక్కువగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపా డు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయానికి పగటిపూట తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల విద్యుత్ సరఫరా వేళలు వివరించారు. ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ఆల్వకొండ, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె, ముక్కమల్ల, కానాల, ముదిగేడు, రెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె తదితర ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

మద్యం షాపుల మూసివేత

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మద్యం దుకాణాలు, బార్‌షాపులను రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4న జిల్లా కేంద్రమైన నంద్యాలలో లోక్‌సభ, శాసనసభ స్థానాల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి మంగళవారం వరకు మద్యం దుకాణాలు, బార్‌షాపులు మూసి ఉంటాయన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ సందర్భంగా సోమవారం సాయంత్రం నుంచి మద్యం దుణాలు మూసివేయనున్నట్లు బనగానపల్లె సెబ్ పోలీస్ స్టేషన్ సీఐ జోగేంద్ర తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్యాపిలి: రౌడీ షీటర్లు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాచర్ల ఎస్‌ఐ చంద్ర మోహన్ హెచ్చరించారు. రాచర్ల గ్రామానికి చెందిన రౌడీ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో రౌడీ షీటర్లు జాగ్రత్తగా మసలుకోవాలన్నారు. అల్లర్లు, అవాంఛనీయ చర్యలకు పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం పరస్పరం రెచ్చగొట్టే చర్యలకు పాల్పడరాదన్నారు.

కళ తప్పతోన్న గనులు!

- వేలాది కుటుంబాలకు జీవనోపాధి
- 1,150 హెక్టార్లలో విస్తరించిన నాపరాతి గనులు
- టైల్స్, గ్రానైట్స్, మార్బుల్స్‌తో తగ్గిన ఆదరణ



అంకిరెడ్డిపల్లె సమీపంలోని నాపరాతి గనులు

కొలిమిగుండ్ల: భూమి అంతర్భాగంలో ఉన్న ఖనిజాలను వెలికితీసే సమయంలో కార్మికులు తమ శక్తినంత కూడదీసి బయటకు వెలికితీస్తుంటారు. ప్రమాదకరమైన పనులు అని తెలిసినా వాళ్లకు ఈపని తప్ప మరొకటి రాదు. రాయలసీమలో బనగానపల్లె నియోజకవర్గం నాపరాతి పరిశ్రమలకు పెట్టింది పేరు. దశాబ్దాలుగా వేలాది కుటుంబాలు గనులపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పనులు చేసే సమయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కార్మికులు ప్రమాదాల బారిన పడుతుంటారు. చాలా మంది పని ప్రదేశంలోనే మృత్యువాత పడిన కార్మికులు పదుల సంఖ్యలో ఉన్నారు. అయినా గనులు కార్మికులతో కళకళలాడేవి. అయితే ప్రస్తుతం గనుల కళ తప్పుతోంది. ఓ వెలుగు వెలిగిన నాపరాతి పరిశ్రమకు ఆదరణ తగ్గిపోతుంది. ఒక రకంగా గడ్డు పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు క్యూకట్టేవారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాపరాయికి గిరాకీ లేక యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కంటే పెట్టుబడులు ఎక్కువగా పెట్టాల్సి రావడంతో మార్కెట్‌లో డిమాండ్ లేక డీలాపడింది. అదేవిధంగా గ్రానైట్, మార్బుల్స్, టైల్స్ హవా సాగుతుండటంతో నాపరాళ్లను ఉపయోగించే వారి సంఖ్య క్రమేసి తగ్గిపోతుంది. ఎగుమతులు ఆశించినంతగా లేక రాళ్లు గనుల్లోనే నిల్వ ఉంటున్నాయి. రానున్న రోజుల్లో నాపరాతి పరిశ్రమ పరిస్థితి ఎలా ఉంటోందనని యజమానులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

1150 హెక్టార్లలో నాపరాతి గనులు

కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాల్లో 1,150 హెక్టార్లలో నాపరాతి గనులు విస్తరించి ఉన్నాయి. 500 మందికి పైగానే లీజుదారులు ఉన్నారు. ఒక్కో నాపరాతి గనిలో 10 నుంచి 12 మంది కార్మికులు పని చేస్తుంటారు. ప్రతి రోజు 5వేల చదరాలకు పైగానే నాపరాయి ఉత్పత్తి జరుగుతుంటుంది. వెలికితీసిన రాళ్లను ట్రాక్టర్లు, లారీల్లో ఇతర జిల్లాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు రవాణా చేస్తుంటారు. ఒకప్పుడు పురుషులతో సమానంగా మహిళలు సైతం గని పనులకు పోయేవాళ్లు. ప్రమాదాల బారిన పడుతుండడంతో క్రమేణా వారి సంఖ్య తగ్గిపోయింది.

40 వేల మందికి ఉపాధి:

నాపరాతి గనుల ద్వారా నియోజవర్గ వ్యాప్తంగా 40 వేల మందికి ఉపాధి లభిస్తుంది. గనులతో పాటు ట్రాక్టర్, లారీల డ్రైవర్లు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులకు పనులు దొరుకుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వందలాది మంది ఉపాధి కోసం వచ్చి ఈ ప్రాంతంలోనే స్థిరపడ్డారు. గనులపై ఆధారపడి పాలీష్ ఫ్యాక్టరీలు ఏర్పాటయ్యాయి. కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాల్లో 700కు పైగానే పాలీష్ ఫ్యాక్టరీలు ఉండగా అనంతపురం జిల్లా తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో 900 మేర ఫ్యాక్టరీలను నెలకొల్పారు.



నాపరాళ్లను వెలికితీస్తున్న కార్మికులు



ట్రాక్టర్‌లో నాపరాళ్లను తరలిస్తున్న దృశ్యం

గని పనికే పరిమితం



30 ఏళ్లకుపైగా నుంచి నాపరాతి గనిలో కూలీ పనులు చేస్తున్నా. ఈపని తప్ప వేరే పని చేయలేం. కూలి కూడా బాగా గిట్టుబాటు అయ్యేది. పనిచేసే సమయంలో ప్రమాదాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఏమాత్రం అదమరిచినా రాళ్లు విరిగి మీద పడుతాయి. అనారోగ్య సమస్యలు ఎదురైన జీవనోపాధి కోసం పని చేయాల్సి ఉంటుంది. నాకు ఊహ వచ్చినప్పటి నుంచి వేరే పనికి వెళ్లలేదు. ప్రస్తుతం గనుల పరిస్థితి ఏ మాత్రం బాగలేదు.

–నాగరాజు,కార్మికుడు,కనకాద్రిపల్లె

మార్కెట్‌లో ఆదరణ సరిగ్గా లేదు



గతంలో నాపరాళ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండేది. గనుల్లో వెలికితీసిన రాళ్లు ఎప్పటికప్పుడు ఇతర ప్రాంతాలకు రవాణా అయ్యేవి. లాభాలు కూడా బాగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రస్తుతం ప్రజలు గ్రానైట్, టైల్స్, మార్బుల్స్‌పై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. అందుకే పరిశ్రమ రోజు రోజు ఆదరణ తగ్గిపోతుంది. ఎగుమతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

– దస్తగిరి, మైనింగ్ యజమాని,బెలుం